# మిత్రద్రోహం

నేను కొత్తగా సబ్ ఇన్‌స్పెక్టరుగా చేరిన రోజులవి. పగలల్లా 'రాంగ్ సైడ్' రాత్రల్లా 'నో లైట్' తప్పితే 'న్యూసెన్స్' కేసులూ కంటే పెద్ద కేసులు పట్టుకున్న మొహాలు కారేమో, మా పోలీసు బృందం, నేను రాత్రి చదివి పూర్తి చేసిన అగథాక్రిస్టి నవలలో కథా సారాంశం, డిటెక్టివ్ పోయిరెట్ సూక్ష్మబుద్దిని గురించి ఉపన్యసిస్తుంటే చెవులు రిక్కపొడుచుకుని గుడ్లప్పగించి తెల్లమొహాలు వేసి వింటున్నారు.

'ఖూనీ చేసినవాణ్ణి పట్టాలంటే........ అలాంటి తెలివుండాలి కానండి.... ....ఈ కత్తులూ తుపాకులూ వుండేం లాభం?'' అన్నాడు మా హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి కథలో డిటెక్టివ్‌ని అభినందిస్తూ.

'సమయం రానీ చూపెడతా నా తఢాకా' అని మనస్సులో అనుకుని ఎందుకయినా మంచిదని ''ఇంతకీ అదంతా కల్పితం ...కేవలం ఊహించి రాసింది' అని పైకి అన్నాను.

"ఏమిటి బావా....ఏదో ఊహ, కల్పనా అంటున్నావు?" అంటూ ప్రవేశిం చేడు మా బావ మధు.

"అబ్బే! నువ్వు రాస్తున్న 'సైకాలజీ ఆఫ్ ది క్రిమినల్'కి సంబంధించిన కొన్ని అంశాలు మా వాళ్ళకి చెబుతున్నాలే'' అన్నాను.

"అయినా, అది నీకు చదివి వినిపించడం నాదే పొరపాటు. ఇంతకి నేను రాస్తున్నవి ఊహలో సిద్ధాంతాలో అవకాశం దొరికితే నిరూపించి చూపెడుదును. ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారం సంవత్సరానికి దగ్గిర దగ్గిర, తొమ్మిది వేల ఖూనీలు మన దేశంలో జరుగుతున్నాయి. అంటే, ఇంచుమించు రోజుకు పాతిక. నువ్వు స్టేషన్ ఛార్జి తీసుకుని రెండు నెలలయ్యింది....చెప్పుకుంటే సిగ్గు ....నీ అధికార ప్రాంతంలో మచ్చుకయినా ఒక్క ఖూనీ జరగలేదు....పోనీ

హత్యా రహస్యం ఛేదించి హంతకుణ్ణి నీకప్పజెప్పినా సిద్ధాంతాల్ని నిరూపిద్దా మంటే" అన్నాడు మధు.

మధు మా మేనత్త కొడుకు. యూనివర్సిటీలో 'సైకాలజీ' లెక్చరర్. స్వతహాగా చాలా తెలివైనవాడు. కాని, డిటెక్టివ్ సాహిత్యంతో బుర్ర వేడెక్కి- ఈ మధ్య కొన్ని కథలు కూడా రాసి పత్రికలకి పంపించటం, తత్ఫలితంగా తృణమో పణమో అందుకోవటం జరుగుతూంది. దానా దీనా దొంగతనాలు, ఖూనీలు చేసే నేరస్థుల మనస్తత్వాలమీద ఓ గ్రంథం రాసేసి దేశాన్నుద్ధరించా లన్న ధోరణిలో పడ్డాడు.

"నీలాంటి పెద్ద మనుష్యులు బలవంతంగా మేమిక్కడికి తీసుకొస్తేనేకాని రారే! నువ్వేమిటి పొద్దున్నే నీ అంతట నువ్వే ఇలా వొచ్చేసేవు?" అన్నాను.

'ఏదో రావడం అలవాటు చేసుకుంటే.... రేప్పొద్దున్నెప్పుడైనా బల వంతంగా ఈ స్టేషన్‌కి రావల్సి వచ్చినప్పుడంత కష్టమనిపించదు....ఆఁ సరేకాని టిక్కట్లు దొరకడం కష్టంగా వుందిట. ఇవ్వాళ మొదటి ఆట 'చరణదాసి'కి నాకో ఎనిమిది టిక్కెట్లు....' అని మధు ఏదో చెప్పబోతున్నాడు. ఇంతలోకే '301' ఒక పిడుగువంటి శుభవార్త తీసుకొచ్చేడు.

పక్కనే నాలుగుమైళ్ళ దూరంలోవున్న పద్మాపురం అనే గ్రామంలో రెండు ఖూనీలు జరిగాయిట. ఆ వూరి కరణంగారే స్వయంగా ఈ కబురు తీసు కొచ్చేరు. వద్దు వద్దు అంటున్నా వినకుండా మధూకూడా మాతోబాటు జీప్ ఎక్కేడు. కొంతదూరం వెళ్ళేక కరణంగారు చెప్పడం మొదలెట్టేరు: ''రంగూన్ టెయిలరింగు హోమ్' అని పేరు పెట్టుకుని ఇంట్లోనే బట్టలు కుట్టుకుంటూ ధర్మయ్యనే ఒక ఆసామీ చాలా మర్యాదగా మా వూళ్ళో కాలక్షేపం చేస్తు న్నాడండి. నిన్న రాత్రి అతను యింట్లో లేకుండా చూసి, అతని పెళ్ళాన్నీ, పదిహేనుళ్ళుగా అతనితోటే వుంటున్న అతని స్నేహితుడు సీతన్ననీ ఎవరో ఖూనీచేసి, ఆ సీతన్న తాలూకు ఐదారువేల రూపాయలు విలువచేసే డబ్బూ దస్కం దోచుకుపోయేరండి!''

''ధర్మ య్యెక్కడి కెళ్ళేడు"

''శేషయ్యనే మరో స్నేహితుడితో కలిసి విశాఖపట్నం వచ్చి మొదటాట 'చరణదాసి'కి రెండో ఆట 'పెంకిపెళ్ళాం'కి వెళ్ళేరుట రెండో ఆట సగంలో

తలకాయి నెప్పి వచ్చిందని చెప్పి శేషయ్య యింటికి తిరిగి వస్తుంటే సరిగ్గా యీ మలుపులోనే....బాబూ! జీప్ కొంచెం ఆపించండి ...''

జీప్ ఆగింది అందరం దిగేం. అక్కడనుంచి పద్మాపురం గ్రామం యిళ్ళు దూరంగా కనబడుతున్నాయి. రోడ్డుపక్కనే చెరువు వుంది. చెరువు కవతలగట్టున రెండు పెంకుటిళ్ళు కనబడుతున్నాయి. కుడిపక్కయిల్లు ధర్మయ్యదిట. ధర్మయ్య యింటికి కుడివైపునన్నీ పొలాలే. ఎడమపక్క సుమారో యాభైగజాల దూరంలోవున్న రెండోయిల్లు చలమయ్యనే రైతుది. చలమయ్య యింటి దగ్గరనుంచి ఎడమవైపుకో ఫర్లాంగు నడిస్తేగాని మిగతా యిళ్ళన్నీ వున్న పెద్ద వీధి తగలదు. ధర్మయ్యింటికి వెనకవైపున సుమారో ఫర్లాంగు దూరంలో ఓ యింటితాలూకు ప్రహరీగోడ, పక్కనే దేవాలయం కనబడుతున్నాయి ఈ రోడ్డు మలుపునుంచి పొలాల కడ్డంపడి నడిస్తే ధర్మయ్యిల్లు సుమారో నూరుగజాల్లో వుంటుంది. ఈ తబిసీళ్ళన్నీ చెప్పి కరణంగారు మళ్ళీ యిలా అన్నారు :

''ఇక్కడికి రాగానే, సినీమానుంచి యింటికి తిరిగివస్తున్న శేషయ్యకి ధర్మయ్యింట్లోంచి కేకలు వినబడ్డాయిటండి. అటు తిరిగిచూస్తుంటే ధర్మయ్యింటి వెనకవైపునుంచి ఒక మనిషి పరుగెత్తుకుంటూ ఆ ప్రహరీగోడవైపు పారిపోతున్నట్టు కనబడిందిటండి. తక్షణం శేషయ్య తన యింటికెళ్ళడం మానేసి ధర్మయ్యింటికి పరిగెత్తుకెళ్ళి, తలుపులు తెరచి వుండటంవల్ల సరాసరి లోపలికెళ్ళి చూస్తే సీతన్న శవం, ధర్మయ్య పెళ్ళాం సింగారిశవం కనబడ్డాయిటండి. బైటకొచ్చి పక్కింటి చలమయ్యని వూళ్ళోకి పంపి పదిమంది మనుషుల్ని పోగు జేసుకురమ్మన్నాడట. అందరూ వచ్చిన తర్వాత శేషయ్య చెప్పినవైపుకు పరిగెత్తి వెతికేరుకాని, అప్పటికప్పుడే వాడెవడో పారిపోయేడు'' అని పూర్తిచేశారు.

''అటు పరుగెత్తినవా డెక్కడి కెళ్ళగలడు?''

''ఆలయం పక్కసందులోంచి వెడితే పెద్దవీధిలోకి దారి వుందండి.''

''ఆ కనబడే ప్రహరీగోడ ఎవరియింటికి చెందింది?''

''కనకయ్య శెట్టి అనే షావుకారిది.''

జీప్ అక్కడే ఆపేసి పొలాల కడ్డంపడి నడిచి అందరం ధర్మయ్యింటికి చేరుకున్నాం. ఆ కూర్చున్న ధర్మయ్యని, శేషయ్యని, అక్కడ ఓదారుస్తున్న ఆ వూరి పెద్దల్ని కరణంగారు పరిచయం చేసేరు.

వీధితలుపు తోసి లోపలి హాల్లో ప్రవేశించగానే నా దృష్టి మొదట గడియ మీద పడింది. గడియ దూరవల్సిన రింగు వంగిపోయి కొంచెం ముందర కొచ్చేసివుంది. ఆ రింగుదగ్గర్నుంచి తలుపు చివర అంచువరకూ గడియ రాపిడి వల్ల తలుపుచెక్క కొట్టుకుపోయివుంది. బైటనుంచి తలుపు బలవంతంగా ఒక్కసారి తోసి తెరచినట్టు స్పష్టంగా తెలుస్తుంది. హాల్లో కుడివైపున మంచంమీద జంబుకానా, దానిమీద ఓ దుప్పటి తలగడా వున్నాయి. వాటిమీద సీతన్న మృతకళేబరం వుంది. కంఠంలోనూ గుండెల్లోనూ ఘోరంగా పొడిచినట్టు రక్తం చిమ్మిన గాయాలున్నాయి. ఈ గాయాల నుంచి స్రవించిన రక్తం జంబుకానావరకూ యింకి రెండు పెద్ద డాగులు కట్టింది. మెడకిందవున్న భాగం తలగడా అంతా రక్తమయమయి వుంది. అతని కుడికాలు మడమ పక్కకి తిరిగి పాదం వంగిపోయి వుంది. అది అతనికి చాలా కాలంగా వున్న సొట్టకాలని తెలిసింది. హాల్లోనే ఆ మంచం పక్కనే ధర్మయ్య కుట్టుకునే సింగర్ మిషన్ వుంది.

హాల్లోంచి కుడివైపునున్న గదిలోకి వెళ్ళాం. అంత భయంకరమైన దృశ్యం నేను చూడటం అదే మొదటిసారి. నా భుజంమీద నుంచి మధు బెదురు చూపులు చూసి వెనక్కి వెళ్ళిపోయి సరాసరి వీధి అరుగుమీద కూర్చున్నాడు. అది ధర్మయ్య పడకగది. అందులోవున్న పాత పందిరి పట్టెమంచంమీద ధర్మయ్య భార్య సింగారి శవం పరుపుకు ఐమూలగా పడివుంది. జుట్టు మంచం మీద నుంచి కిందకి వేళ్ళాడుతూ వుంది. సింగారి శరీరం పొడుగునా, నాలుగు చోట్ల దారుణమైన గాయాలున్నాయి. రక్తం మంచంమీదే కాకుండా గది నాలుగు మూలలా చిమ్మి, పక్కనున్న నేలమీద మడుగులు కట్టింది. మంచం కోడు దగ్గరే బట్టలు కత్తిరించే పెద్ద కత్తెర రక్తపూరితమై పడివుంది. గాయాల కేసి చూస్తే చాలు-ఆ కత్తెరే హత్యాయుధం అనడానికి వేరే ఆధారం అక్కర్లేదు.

సింగారి వయస్సు సుమారు పాతిక సంవత్సరా లుంటాయి. చక్కటి వంపులు తిరిగిన శరీరం, పెద్ద కళ్ళు ఒక్క క్షణం ఆ మొహంలోకి చూస్తూ హంతకుణ్ణి ఉరికంబ మెక్కించి ఆమె తరపున పగసాధించడానికి మనస్సులోనే శపథం చేసుకున్నాను.

ఆ మంచం కిందనే సీతన్నకు చెందిన ట్రంకుపెట్టి తాళం బద్దలుకొట్టి వుంది. అందులో బట్టలన్నీ చిందర వందరగా పడివున్నాయి. ట్రంకుపెట్టి

బయట ఒక చిన్న కర్ర పెట్టె తెరచి పడివుంది. ఆ చిన్న కర్ర పెట్లో ప్రామిసరీ నోట్లు వ్రాయటానికి కావల్సిన స్టాంపు కాగితాలూ రెవిన్యూ స్టాంపులూ తప్ప యింకేమీలేవు. అందులో సీతన్న డబ్బూ అప్పు పత్రాలూ దాచేవాడట. అవన్నీ దొంగిలింపబడ్డాయట.

ఆ గదిలోంచి వంట యింట్లోకి వెళ్ళిచూసేం. రెండు మూడు చోట్ల రక్త బిందువులు కనబడ్డాయి. వంట యింట్లోంచి దొడ్డివైపుకు వున్న తలుపు తెరిచే వుంది. అది తెరచుకుని అందులోంచే హంతకుడు పారిపోయి వుండాలి.

హంతకుడి ఆచూకీ కనిపెట్టడానికి సహాయపడే ఆధారాలింకేమీ అక్కడ కనబడలేదు. వేలుముద్రలు తియ్యటానికి కావల్సిన పరికరాల్ని, శవపరీక్ష చెయ్యటానికి డాక్టర్ని, హత్యాన్వేషణ కుపయోగపడే వస్తువుల్ని, ప్రదేశాల్ని ఫొటోలు తియ్యటానికో ఫొటోగ్రాఫర్‌ని తీసుకు రమ్మని జీప్‌మీద కానిస్టేబుల్‌ని పంపించేను. ధర్మయ్య యింట్లో ఎడమవైపువున్న గది ఖాళీచేసి అందులో రెండు కుర్చీలు మాకు వేశారు.

ధైర్యంగా వుండి మాకు సహకరించ వల్సిందని ఓదార్పు మాటలతో ధర్మయ్య వాఙ్మూలం తీసుకున్నాను.

''రాత్రి నువ్వెక్కడున్నావు? ఈ హత్యాసమాచారం నీకెప్పుడు తెలిసింది? నువ్వెప్పుడిక్కడికి తిరిగి వచ్చేవు?'' అడిగేను.

''రాత్రి రెండో ఆటచూసి సత్రవులో పడుకున్నానండి. రాత్రి మూడు గంటల ప్రాంతంలో శేషయ్య తిరిగొచ్చి నాకు చెప్పేడు. ఇద్దరంకలసి తెల్లారే టప్పటికి ఇక్కడి కొచ్చేసేమండి'' అన్నాడు ధర్మయ్య.

ధర్మయ్యని పంపించేసిన తర్వాత శేషయ్యని పిలిపించాను. కరణం గారు మాకు దార్లో చెప్పినదే తుచ తప్పకుండా చెప్పేడు.

''మీరిద్దరూ కలసి సినిమాకెళ్ళే రివాజు యిదివరకునుంచీ వుందా?'' అడిగేను.

''ఉందండి. వెళ్ళినప్పుడల్లా రెండాటలూ చూసి రాత్రి టర్నర్ సత్రవులో పడుకుని మర్నాడు పొద్దుటే బజారుపనీ చూచుకుని మధ్యాన్నానికింటి కొచ్చేస్తూ వుంటాం'' అన్నాడు శేషయ్య.

''ఆటమధ్యలో వచ్చేసేటంత తలనొప్పికి కారణం సినిమా అంత బాగుండటంవల్లనా, లేకపోతే శరీరంలో స్వస్థత చాలకనా?''

''రెండూనండి.''

''నువ్వు రాత్రి రెండో ఆట సగంలో వచ్చేసినప్పుడు అవుట్ పాస్ తీసుకున్నావా?'' అని అడిగేడు మధు.

"చిత్తం....ఇదిగోనండి" అంటూ జేబులోంచి తీసి నాకందించేడు శేషయ్య.

తర్వాత పక్కింట్లో కాపరముంటున్న చలమయ్యని పిలిచేను.

"నిన్నరాత్రి పక్కింట్లో యింత గొడవ జరిగితే మీకు తెలీలేదా?" అడిగేను.

''తెలియకేంబాబూ? ముందర పెద్ద శబ్దమయిందండి. మెళుకువొచ్చి అదేంటోనని ఆలోచించే వేళకి ధర్మయ్యింట్లొంచి కేకలు వినబడ్డాయండి. బయట కొచ్చి చూస్తే అంతా చీకటి. ధర్మయ్యింటివేపు పరుగులేసి 'సీతన్నబావా!' అని పిలిచేనండి. జవాబు లేకపోతే మళ్ళీ యింట్లోకొచ్చి లాంతరు వెలిగించుకుని చేతికర్ర పుచ్చుకుని బయట కొస్తుంటే ధర్మయ్యింటిమెట్లు శేషయ్యెక్కుతున్నాడు. నే ధర్మయ్య యింటిదగ్గర కొచ్చేటప్పటికి శేషయ్య యింట్లోంచి బయిటకొచ్చి....ఖూనీ జరిగిందని చెప్పి నన్ను ఊళ్ళోకెళ్ళి మనుషుల్ని తీసుకు రమ్మని పంపించేడు'' అన్నాడు చలమయ్య.

''రెండోసారి నువ్వు బయట కొచ్చినప్పుడు ధర్మయ్య యింటి మెట్లెక్కుతూ శేషయ్య నీకు కనబడ్డాడు. మొదటిసారి బైటకొచ్చినప్పుడు నీకెవరూ కనబడలేదు. ఔనా?"

''చిత్తం.''

"శేషయ్య నీకు కనబడేముందరకాని, తర్వాత నువ్వు మనుషుల్ని పోగేసుకొచ్చేలోగాకాని ధర్మయ్యింటి కెవరెళ్ళిందీ ఏం జరిగిందీ నీకు తేలీదు?'''

''చిత్తం.''

''శేషయ్య ఖూనీ జరిగిందని చెప్పినప్పుడు నువ్వు ధర్మయ్య యింట్లో కెళ్ళి చూడలేదుకదూ?''

''లేదండి.''

''సింగారి ఎలాంటి మనిషి?'' అడిగేడు మధు.

"నాకు తెలీదండి."

"చాలా మంచిమనిషని నిశ్చయంగా చెప్పలేనంటావు?"

"నాకు తెలీదు బాబూ!"

"సరేకాని, నీకూ శేషయ్యకీ ఏమైనా చుట్టరికం వుందా?"

"ఉందండి శేషయ్య మా యావిడ మేనత్తకొడుకు."

"తరచు మీ యింటి కొస్తూవుంటాడా?"

"ఎందుకు రాడండీ? ధర్మయ్యింటి కొచ్చినప్పుడల్లా మా యింట్లో పలకరించి వెడుతూనే వుంటాడు."

చలమయ్య బయటి కెళ్ళిపోయాక "ఓ సారి చలమయ్య భార్యని కూడా రమ్మని కబురుపెట్టు" అన్నాడు మధు. "అంత చూడాలనివుంటే వెళ్ళి చూసిరా" అన్నాను. అంతలో కరణంగారు రాగానే తన కుర్చీ ఖాళీచేసి బయటకెళ్ళేడు.

"ధర్మయ్య, సింగారి, సీతన్న- రంగూన్‌నుంచి వచ్చేరు కదా. వీళ్ళ పుట్టు- పూర్వోత్తరాలు మీకేమైనా తెలుసా?" అడిగేను.

"అవన్నీ ధర్మయ్యే యీ వూరు రాగానే అందరికి చెప్పేడు. పదిహేను సంవత్సరాల క్రితం రంగూన్‌లో ధర్మయ్యకీ సీతన్నకి స్నేహం కుదిరిందిట. అప్పట్నించీ అన్నదమ్ముల్లాగ ఒకేచోట వుంటూ వచ్చేర్ట. ధర్మయ్యకంటే సీతన్న ఎక్కువడబ్బు సంపాదించేవాడట. దానా దీనా ఐదేళ్ళక్రితం సీతన్న దగ్గిర రెండు మూడువేల రూపాయలు రొక్కం వుండేదట. ఆ రోజుల్లోనే ప్రమాద వశాత్తూ సీతన్న కాలు విరిగిందట. అది కుదిరేవరకూ సింగారితల్లిని సీతయ్యకి పరిచర్య చెయ్యటానికి ధర్మయ్య కుదిర్చేడుట. మధ్య మధ్య తల్లి రావడానికి వీలు లేనప్పుడు సింగారే వచ్చి కట్టుకట్టి వంట చేసిపెట్టి వెళ్ళిపోయేదిట. తన కష్ట సుఖాలు చెప్పుకోవడంలో ఓ సారి సింగారి ధర్మయ్యతో తన తండ్రి తన్ను వడుపువృత్తిలోకి దిగమని బలవంతం చేస్తున్నాడనీ తన బ్రతుకు దినదిన గండంగా వుందనీ చెప్పుకుందిట. ఆ సాయంత్రమే సీతన్నతో సంప్రతించి సింగారిని పెళ్లాడతాననని చెప్పి ధర్మయ్య ఎవరితోటీ చెప్పకుండా మూటా ముల్లీ

సర్దుకుని సీతన్నని సింగారిసీ తీసుకుని అప్పుడే బయలుదేరబోయే ఓడ ఎక్కేసి పారిపోయొచ్చేడుటండి. ఇక్కడ కొచ్చిన తర్వాతే ధర్మయ్య సింగారిని పెళ్ళాడేడు. సొట్టకాలవడంవల్ల సీతన్న ఏ పని చెయ్యడానికి యిష్టపడక తన దగ్గరున్న డబ్బుతో, శేషయ్య చలమయ్యల ప్రోత్సాహంమీద వడ్డీ వ్యాపారం మొదలెట్టేడు. ఈ నాలుగైదేళ్ళలోనూ నాలుగైదువేల రూపాయిల ఆస్తిపరుడయ్యేడు. ఇప్పుడు యీ యిల్లు ధర్మయ్య పేరిట సీతన్న చలమయ్య దగ్గిర కొన్నాడండి" వివరించేడు కరణం.

"ఈ వూర్లో మరో వడ్డీ వ్యాపారస్థు డెవడైనా వున్నాడా?"

"చిత్తం. కనకయ్య శెట్టి అనే అతను వున్నాడండి."

"అంటే, యీ ఇంటి వెనకాల కనబడే ప్రహరీగోడ అతనిదే అన్నారు కదూ?"

"అవునండి."

"మరి అటేకదా హంతకుడు పారిపోయేడని శేషయ్యన్నాడు. అక్కడ మీరు వెతిగించేరా?"

"వెతిగించేదేండి రాత్రి అక్కడ కొందరు వెతుకుతుంటే ఆ అలికిడికి కనకయ్యశెట్టి కళ్ళు నులుపుకుంటూ దొడ్డి తలుపుతీసి అందరితోబాటూ తను కూడా ఆ ప్రాంతమంతా వెతికేడండి."

"సీతన్నకి కనకయ్యశెట్టికి శత్రుత్వమేమైనా వుందా?"

"లేదండి. ఉంటే వ్యాపారరీత్యా కొంత ఈర్ష్య వుండొచ్చు. ఎంచేతనంటే సీతన్న వచ్చేక కనకయ్య శెట్టి వడ్డీ వ్యాపారం దెబ్బతింది."

"పోనీ....ఈ వూళ్ళో సీతన్న దగ్గిర పెద్ద మొత్తా లప్పు తీసుకున్నవాళ్ళెవరో చెప్పగలరా?"

"తను యిప్పుడుంటున్న యింటిమీద చలమయ్య పదిహేను వందలు తీసుకుని నిరుడే తన కూతురు పెళ్ళి చేసేడండి. తర్వాత ఓ వెయ్యి రూపాయిలు ఈ యేడే శేషయ్య తీసుకున్నాడు. చవగ్గా తన పొలం సరిహద్దులోనే పొలం అమ్మకానికొస్తే ఏభయి సెంట్లు కొన్నాడు. ఈ యిద్దరూ అప్పు రెండు మూడేళ్ళలో తీర్చివెయ్యగల సమర్థులే. మిగిలినవన్నీ వందా రెండు వందలూ బాపతు."

తర్వాత ధర్మయ్యా శేషయ్యల అంతరంగిక స్నేహితుల్ని దర్యాప్తు చెయ్యగా మరికొన్ని విషయాలు బయట పడ్డాయి.

ధర్మయ్యా శేషయ్యలకు రంగూన్‌లో కూడా స్నేహముండేదిట. ధర్మయ్యా రావడానికి రెండేళ్ళక్రితం శేషయ్యా ఈ వూరొచ్చి భూమి కొనుక్కుని స్థిరపడ్డాడు. శేషయ్యా రంగూన్‌లో వుండగా కొన్నాళ్ళు శేషయ్యను సింగారి తండ్రి సింగారి నిచ్చి పెళ్ళి చేస్తానని చెప్పి డబ్బు గుంజేవాడుట. ఇక్కడికి వచ్చేసేముందరే సింగారి తండ్రి అలా మభ్యపెట్టి చాలా మందిని మోసం చేసేదని గ్రహించి వాణ్ణి నాలుగుతన్ని ఎవరికీ చెప్పకుండా యిక్కడికి తిరిగి వచ్చేసోడుట. ఇక్కడి కొచ్చేక ఈ వివరాలన్నీ ధర్మయ్యాకి శేషయ్యా చెప్పేడుట.

రాను రాను కేసు అగాధమయ్యేలా కనబడుతుంది. శేషయ్యా, చలమయ్యా, కనకయ్యశెట్టి— ఈ ముగ్గురికీ ఈ హత్యవల్ల లాభం కనబడుతోంది. ఈ హత్యలు చెయ్యటానికి, చేయించడానికి ఈ ముగ్గురికీ అవకాశాలున్నాయి. శేషయ్యా ఏంచేసేడో చూసింది చలమయ్యా. చలమయ్యా ఏం చేసేడో చూసింది శేషయ్యా ఈ యిద్దరూ బంధువులు. ఈ యిద్దరూ కూడబలుక్కుని ఈ ఘోరం చేసినా చేసివుండొచ్చు. పోయిన డబ్బూ, ఆ అప్పు పత్రాలూ ఏమయ్యాయో తెలిసే వరకూ ఈ కేసు అంతుదొరకడం కష్టం ఇలా ఆలోచించుకుంటుంటే మధు వచ్చేడు.

"చలమయ్య భార్యని కలుసుకు వచ్చేను బావా!" అన్నాడు.

"మంచిపని చేసేవు, ఇంతకీ తన్నులు తినకుండా తిరిగొచ్చేవు. అదే పదివేలు" అభినందించేను.

"సరేకాని-శేషయ్యని, ధర్మయ్యని మరికొన్ని విషయాలడగాలి. ఓసారి పిలిపిస్తావా?" అడిగాడు మధు.

ఆలోచనలతో బుర్రవేడెక్కి పోయింది. పైగా, పోస్ట్ మార్టమ్ ఫొటో గ్రాఫర్ వగైరాలు రాలేదు. ఈలోగా మా బావ మేధాశక్తిని కాస్త చవిచూడొచ్చు నని శేషయ్యని రప్పించేను.

"హత్యకి సహాయపడటం, హత్యాన్వేషణకి కావల్సిన ఆధారాలను దాచడం, చూసినవి చూడలేదనడం, చూడనివి చూసేనని అబద్ధమాడటం— ఈ నేరాలకి శిక్ష ఏమిటో తెలుసా?" శేషయ్యని అడిగాడు మధు.

''చిత్తం'' అన్నాడు శేషయ్య.

"'సరే, మీరిక్కడ కాస్సేపు కూర్చుని వెళ్ళండి.''

నాకు అంత చిరాకులోనూ నవ్వొచ్చింది. మా బావపడ్డ శ్రమకి ఫ్లాస్కు లోంచి గ్లాసులో పోసి కాఫీ అందించేను. నిశ్శబ్దంగా కాఫీతాగి సావకాశంగా సిగరెట్ వెలిగించి రెండు దమ్ములు పీల్చి గడియారం చూసుకుని ''ఆల్ రైట్ 304— ధర్మయ్యగారిని ప్రవేశపెట్టు'' అన్నాడు మధు.

304 ధర్మయ్యని లోపలికి తీసుగొచ్చేక మధు శేషయ్యతో ''శేషయ్య గారూ! మీ నేరానికి శిక్ష తప్పదు. ఎటువంటి శిక్ష పడేదీ ధర్మయ్య అనుగ్రహం మీద ఆధారపడి వుంటుంది. మిష్టర్ 304 ఆయన్ని జాగ్రత్తగా బయటికి తీసుకెళ్ళు'' అన్నాడు. శేషయ్య ఏదో అనబోతుంటే మధు కనుసౌజ్ఞ ననుసరించి 304 శేషయ్యని బయటికి తీసుకెళ్ళి తలుపు మూసేశాడు.

బయటికెడుతున్న శేషయ్యకేసీ నాకేసీ మధూకేసీ విస్తుపోయి చూసి ధర్మయ్య 'దేనికి బాబూ నా అనుగ్రహం?' అన్నాడు.

"శేషయ్య తన నేరాన్ని ఒప్పుకున్నాడు.'' అన్నాడు మధు.

''నేరమాండి!'' అన్నాడు ధర్మయ్య ఆశ్చర్యంగా మొహం పెట్టి.

''సీతన్న శవాన్ని ఆ గదిలోంచి హాల్లోకి మార్చడం, నువ్వు తప్పించుకు పారిపోవడానికి సహాయపడటం'' అన్నాడు మధు.

నిలువునా కుప్పకూలిపోయినట్టు కూలిపోయి చేతుల్తో మొహం కప్పుకుని ధర్మయ్య ''బాబూ.... జరిగిందేదో జరిగిపోయింది. నా కిష్టంలేకపోయినా నన్ను కాపాడుదామన్న వుద్దేశంతో యిందులో శేషయ్య తల దూర్చేడు. నేనేమై పోయినా బాధలేదు శేషయ్యని మాత్రం రక్షించండి'' అంటూ భోరున ఏడవటం మొదలెట్టాడు.

నాలో నేను తిరుగుతూ ఆ గది నా చుట్టూ తిరుగుతున్నట్టు నా కంతా అగమ్యగోచరంగా కనబడింది. కళ్ళు తుడుచుకుని గొంతు సవరించుకుని ధర్మయ్య చెప్పటం మొదలెట్టేడు. 'సంవత్సరంనుంచి శేషయ్య సీతన్నకి పెళ్ళి చేసి నా యింట్లోంచి పంపించేసి వేరే కాపరం పెట్టించమని సలహా చెబుతూ వచ్చేడు. దాంట్లో అర్థం తెలుసుకోలేకపోయాను. నిన్నరాత్రి మొదటాట సినీమా అయిన తర్వాత, మాటల్లో శేషయ్య సీతన్నకి సింగారికి సంబంధం వుందనీ,

సీతన్న నాకు మిత్ర ద్రోహం చేస్తున్నాడనీ తేల్చేడు. రెండో ఆట సగంలో నే నింక వుండబట్టలేక, శేషయ్యతో చెప్పకుండా తిన్నగా యింటి కొచ్చేశాను. మెల్లిగా మా యింటి మెట్లెక్కుతుంటే, లోపలినుంచి సింగారి సీతన్నల నవ్వులూ కేరింతాలూ పడకగదిలోంచి వినబడ్డాయి. బలంకొద్దీ తలుపు ఛళ్ళున తెరిచేను. మిషన్‌మీద ఎదురుగుండా కత్తెర కనబడింది. అది తీసుకుని పడకగదిలోకి ఒక్క గంతులో వెళ్ళేను. మంచం మీదనుంచి లేవబోతున్న సీతన్నని కసితీరా కత్తెరతో పొడిచేను. పెళ్ళి వద్దనడం, ఇల్లు నా పేర కొనడం, సింగారికి నగలూ చీరలూ కొనుక్కోమని డబ్బివ్వటం - అవన్నీ ఎందుకో నా కప్పు డర్థమయింది. సింగారి అడ్డుపడి కేకలెయ్యబోయింది. రెట్టించిన కోపంతో సింగారి జుట్టుపట్టుకుని ఒళ్ళంతా పొడిచి చంపేను. ఇంకా కత్తెర చేతిలో వుండగానే శేషయ్య ఒగర్చుకుంటూ వచ్చి ఒక్క క్షణం అలాగే నిలబడిపోయి నన్ను వంటింట్లో వుండమని చెప్పి తను బయటకెళ్ళి చలమయ్యని పూళ్ళోకి పంపి తను మళ్ళీ లోపలికొచ్చాడు. శేషయ్య సలహా మీద సీతన్న శవాన్నిద్దరం కలిసి హాల్లోకి మార్చేం. తర్వాత పాగాకొయ్యనున్న మరో జత బట్టలు నా కిచ్చి వంటింటి తలుపు తీసుకు పారిపోయి వూరు బయట కాలవ దగ్గర ఒళ్ళు కడుక్కుని గుడ్డలు మార్చుకుని సత్రవు దగ్గిరకి పొమ్మని సలహా ఇచ్చేడు. మళ్ళీ బతుకు మీద ఆశపుట్టి శేషయ్య మాట కాదనలేకపోయేను."

"సీతన్న పెట్టె బద్దలుకొట్టి దొంగతనం జరిగినట్టు ఎత్తు వేసింది శేషయ్యన్నమాట?" అడిగేడు మధు.

"చిత్తం. తర్వాత రాత్రి మూడు గంటలకి సత్రవు దగ్గిర నన్ను కలుసుకుని అన్నీ తను జాగ్రత్త పెట్టేననీ కేసు గొడవయిన తర్వాత డబ్బు మాత్రం నా కిచ్చేని కాగితాలు మాత్రం తగలబెట్టేస్తాననీ చెప్పేడండి." చెప్పేడు ధర్మయ్య.

బేడీలు వేయించి ధర్మయ్యని బయటకు వంపించేక మధూతో "మైడియర్ షెర్లాక్ హోమ్స్! హంతకుణ్ణి ఎలా పసిగట్టేవో నాకింకా అర్థం కాలేదు" అన్నాను.

"సింపుల్.... మైడియర్ వాట్సన్!.... వెరీ సింపుల్.... నువ్వు ఎక్కడ పప్పులో కాలేసేవంటే.... హత్యకి, దొంగతనానికి సంబంధం వుందనుకోవడం" అన్నాడు మధు నవ్వుతూ.

"ఎందుకనుకోకూడదూ?" అడిగేను.

"దొంగతనం చెయ్యదలచుకున్నవాడు వీధి తలుపు భళ్ళున తెరిచి లోపలి కెళ్ళడు. ఒకవేళ అలా వెళ్ళినా కూడా కత్తో, బల్లెమో తీసుకెడతాడు కాని, వాళ్ళని చంపడానికి అక్కడ కత్తెర వుంటుందని కలగంటాడా? అసలు కత్తెరతో పొడవడం అంత సులభంకాదు. కత్తెర పట్టుకోవడానికే కొంత అనుభవం వుండాలి. ఇంకో విషయం.... చంపడానికి గుండెల్లోనో, కంఠంలోనో పొడిస్తే చాలదూ, ఒళ్ళంతా ఎందుకు పొడవాలి! అందుచేత వీధి తలుపు తెరచిన పద్ధతి, హత్యాయుధం, హత్యావిధానం కేవలం ఈ హత్య పట్టరాని ఆవేశంలో జరిగిందని చెబుతూనే వున్నాయి...."

"మరి శవాన్ని మార్చిన సంగతి?"

"సింగారి పడుకున్న గదంతా చిమ్మిన రక్తం హాల్లో చిమ్మలేదేం? కేవలం తలగడా దుప్పటి జంబుకానా తడిసేయి. అవి గాయాలనుండి కారిన రక్తండాగులు. పోటుపొడిచిన తర్వాత కత్తెర పైకి లాగగానే గాయంనుంచి రక్తం చిమ్ముతుంది. అదీకాక మంచంమీద, పక్కనున్న గోడమీద చిమ్మిన రక్తం సింగారి గాయాలనుంచి అనుకోవాలి. మరి మంచం బయట చిమ్మిన రక్తం? అక్కడ వున్న డాగులూ?"

"శేషయ్యకి ఎవరో పారిపోయినట్టు కనబడటం?...."

"శుద్ధ అబద్ధమని కనబడుతూనే వుంది. కేకలు వినబడ్డ మరుక్షణంలో మనిషి పారిపోవడం చూసేనంటాడు కదా! చంపినవాడు పెట్టె బద్దలు కొట్టాలి. మళ్ళీ అందులోంచి కర్రపెట్టె తీసి బద్దలుకొట్టి డబ్బూ, కాగితాలూ తీసుకుని వంటింటి తలుపు తెరుచుకుని పారిపోవాలి. ఎంతలేదన్నా, హత్య తర్వాత ఐదారు నిమిషాలేనా అవుతుంది. ఈ ఐదారు నిమిషాలూ శేషయ్య ఆ మలుపులోనేవుంటే చలమయ్య లాంతరు పుచ్చుకుని ధర్మయ్య యింట్లో ప్రవేశించేవాడు."

"అసలెవడో కనబడినట్టెందు కబద్ధమాడాలి?"

"ధర్మయ్యని రోడ్‌వైపుకు పారిపొమ్మన్నాడు కదా! తర్వాత ఊళ్ళో వాళ్ళు వెతకడానికని రోడ్ వైపుకు పరిగెడితే ధర్మయ్య దొరికిపోవచ్చు. అంచేత ప్రహారీగోడవైపు అందర్నీ తప్పుదారి తొక్కించేడు."

''అంతా బాగానే వుంది కాని.... ధర్మయ్య తన నేరాన్ని ఒప్పుకోకపోతే ఈ కేసు నిరూపించడానికి నిదర్శనా లున్నాయా?''

''ఈ తలుపు కొట్టేవాడు 101 అయి వుండాలి.... ఓ.... యిదుగో.... ఏమోయి.... కాయా? పండా?''

''పండేనండి ఇదిగో చొక్కా పంచా. మీరు చెప్పినట్టే మనకి మూడో మైలులో ఎదురయిన పంటకాలవ దగ్గిరంతా నేనూ, యిద్దరు దారే పోయేవాళ్ళూ వెతికేం. ఆ దగ్గరలోనే పొదల్లో ఈ రక్తం మరకలున్న గుడ్డలు దొరికేయి'' అన్నాడు 101.

''మరి సినిమాహాల్లో కనుకున్నావా?''

''ఒకటికాదు.... రెండు అవుట్‌పాస్‌లు పోయాయిటండి ''

బయట కెళ్ళేక ''బావా!.... మరొక్క సందేహం....'' అనబోతున్నాను.

"సింగారికి సీతన్నకి వున్న సంబంధం శేషయ్య కెలా తెలుసునూ అంటావు-అవునా? ఆ ప్రశ్నే నన్నూ చాలా తికమక పెట్టింది. దానికి ఒకటే అవకాశం వుంది. పక్కింటి వాళ్ళద్వారా తెలిసివుండాలి. అనుకున్నట్టుగానే చలమయ్య భార్యకి శేషయ్యకి బంధుత్వమున్నట్టు తెలిసింది. నేను చలమయ్య భార్య దగ్గిర కెళ్ళి దబాయించేటప్పటికి తనే శేషయ్యతో చెప్పేనని ఆ యిల్లాలు ఒప్పుకుంది" అన్నాడు మధు.

"ఇంతకీ నువ్వు రాస్తున్న పుస్తకం ఎప్పటికి పూర్తవుతుందీ?.......అ( 304....చూడు, ఈ యిరవై రూపాయలూ నీదగ్గరుంచుకుని, మా బావకో ఎనిమిది నాకొకటి మొత్తం తొమ్మిది టిక్కట్లు చరణదాసి మొదటి ఆటకి రిజర్వు చేయించు. మిగిలిన డబ్బు దగ్గరుంచుకుని ఈ కేసుమీద వచ్చిన మీ ఆరుగురు కానిస్టేబుల్సూ రాత్రి రెండో ఆటకి కొట్టెయ్యండి" అన్నాను, ధీమాగా జేబు లోంచి డబ్బుతీసి అందిస్తూ.

*